పోలింగ్ విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పోలింగ్ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని మాస్టర్ ట్రైనర్లు వివరించారు. మంగళవారం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో పంచాయతీ ఎన్నికల పోలింగ్ సిబ్బంది, ఆర్వోలు, ఏఆర్వోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పోలింగ్ రోజున, ఫలితాలు వెల్లడించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మొత్తం 601 మంది ఆర్వోలు, ఏఆర్వోలకు శిక్షణ కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, ఏవో రాజేశ్వర్, డీఎల్పీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్‌ను మించి
ఖమ్మం అభివృద్ధి

- అన్ని రాష్ట్రాల ప్రజలు ప్రశాంతంగా జీవించే గుమ్మం ఖమ్మం
- కక్షలు, కార్పణ్యాలు లేని నగరంగా రూపుదిద్దుతాం
- మరో రూ.300కోట్లతో అభివృద్ధికి కార్యాచరణ
- 46వ డివిజన్ పర్యటనలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


6

విలీన పంచాయతీల సమస్యలు
తక్షణమే పరిష్కరించాలి

కేఎంసీ కమిషనర్‌కు మంత్రి తుమ్మల ఆదేశాలు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

వన రామయ్యకు..
నీరాజనం





స్వామి వారికి పుష్పార్చన

- భద్రాచలంలో కన్నుల పండువగా శబరి స్మృతి యాత్ర
- వేలాదిగా తరలొచ్చిన మన్యం వాసులు
- పూలు, పండ్లు సమర్పణ
- శబరి చిత్రపటంతో శోభాయమానంగా సాగిన గిరి ప్రదక్షిణ
- పాల్గొన్న ఐటీడీఏ పీవో, దేవస్థానం ఈవో

భద్రాచలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : శబరి ఎంతో భాగ్యశాలి.. మరెంతో విశేషమైన పుణ్యం చేసుకుంది. మాతంగ మహర్షి ఆశ్రమంలో జీవించిన రుషిక ఆమె. ఆనాడు రామయ్యకు ఫలాలను సమర్పించి ఉత్తమమైన గతులను పొందిందని వాల్మీకి రామాయణంలో పేర్కొనబడింది. అంతటి పుణ్య వనిత శబరి పేరిట స్మృతి యాత్రను భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం 12వసారి ఘనంగా నిర్వహించారు. భద్రాద్రి రామయ్యను కనులార వీక్షించేందుకు దూర ప్రాంతాల నుంచి గిరిజనులు తరలివచ్చారు. అలాగే గిరిజన సంప్రదాయ వేషధారణతో వారు శబరి స్మృతి యాత్రలో పాల్గొనేందుకు

(మిగతా 6వ పేజీలో)



గిరి ప్రదక్షిణలో గిరిజన సంప్రదాయ ప్రదర్శనలు



భద్రగిరి ప్రదక్షిణ

'స్థానికం'పై..
టెన్షన్!



- నేటి హైకోర్టు విచారణపై ఉత్కంఠ
- రాజకీయ పార్టీల్లో డోలాయమాన పరిస్థితి
- ఆశావహుల్లో రిజర్వేషన్ల గుబులు..
- స్పష్టత కోసం ఎదురుచూపు
- ఎన్నికల నిర్వహణలో తన పని తాను చేసుకుపోతున్న యంత్రాంగం

"స్థానిక ఎన్నికలు జరుగుతాయా? వాయిదా పడతాయా? ఒకవేళ జరిగితే కొత్త రిజర్వేషన్లు కొనసాగిస్తారా? మార్చాల్సి వస్తుందా? పాత వాటితోనే ఎన్నికలకు వెళతారా? ఇదీ ప్రస్తుతం గ్రామీణస్థాయి నుంచి మొదలుకుని రాష్ట్రస్థాయి నేతల వరకు అందరిలోనూ జరుగుతున్న చర్చ. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఇచ్చిన జీవో9 ను సవాల్ చేస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం సదరు పిటీషన్‌పై బుధవారం విచారణ నిర్వహించనుంది. ఈ క్రమంలో కోర్టు జోక్యంతో ఎన్నికలు జరుగుతాయా? వాయిదా పడతాయా? అన్న ప్రశ్నలు తలెత్తుండగా.. యంత్రాంగం మాత్రం షెడ్యూల్ ప్రకారం ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమైంది."



ఖమ్మం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

గతంలో ఎన్నడూ లేని విధంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై టెన్షన్ వాతావరణం కనిపిస్తోంది. రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు మంగళ వారం విచారణ నిర్వహించనున్న నేపథ్యంలో హైకోర్టు తీసుకునే నిర్ణయంపై రాజకీయపార్టీలు, ఆశావహులు, ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తుండగా.. యంత్రాంగం మాత్రం తన పనితాను చేసుకుపోతోంది. హైకోర్టు నిర్ణయం ఎలా ఉన్నా ఎన్నికల నిర్వహణ కోసం యంత్రాంగం ఇప్పటికే మండల, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు పదవులకు ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులను, కౌంటింగ్ అధికారులను సిబ్బందిని సిద్ధం చేసి.. సమావేశాలు నిర్వహించింది. నామినేషన్ల ప్రక్రియను దృష్టిలో పెట్టుకుని విడతల వారీగా చేపట్టే ప్రక్రియను జిల్లా అధికారులు వివరించారు. దీంతో ఇటు ఖమ్మం.. అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో షెడ్యూల్ ప్రకారం రెండు విడతలుగా జిల్లా, మండల పరిషత్, మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

నేటి విచారణపైనే అందరి దృష్టి

బీసీ రిజర్వేషన్లపై బుధవారం హైకోర్టు నుంచి నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఈ రిజర్వేషన్ల కొనసాగింపునకు అంగీకారం తెలిపినా, తీర్పును వాయిదా వేసినా బీసీలకు 42శాతం రిజర్వేషన్‌తోనే 9న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడబోతోంది. దీనికి అనుసరించి రెండు విడతలుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఆయా మండలాల్లో ముందుగా నిర్వహించబోతున్నారు.

- మొదటి విడత మండల, జిల్లా పరిషత్ నియోజకవర్గాలకు 9నుంచి 11వరకు నామినేషన్లు ప్రారంభం కానున్నాయి. రెండో విడత ఎంపీటీసీ, జడ్పీటీసీలకు ఎన్నికలకు ఈనెల 17నుంచి 19వరకు నామినేషన్ల స్వీకరణ జరగనుంది. అలాగే గ్రామపంచాయతీలకు మొదటి విడత 17నుంచి19వరకు, రెండో విడత ఈనెల 21నుంచి23 వరకు, మూడో విడత 25నుంచి 27వరకు నామినేషన్ల ప్రక్రియ ఉంటుంది. ఎంపీటీసీ, (మిగతా 8వ పేజీలో)

వాల్మీకి.. రామాయణంతో విలువలు అందించారు

మహర్షి జయంతి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి తన రామాయణంతో సమాజానికి విలువలను అందించారని, అలాంటి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాకవి వాల్మీకి ఆధ్యాత్మికవేత్తగా రామాయణ కావ్యం రచించి ఆదికవిగా వెలుగొందారన్నారు. రామాయణం ద్వారా మానవ సంబంధాలు, విలువలను బోధించారన్నారు. అనంతరం వక్తలు మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అటవీశాఖలో..
అక్రమార్కులకు సం'రక్షణ'!

- వివాదాస్పదంగా మారిన కలప రవాణా పర్మిట్ల వ్యవహారం
- ఏడాదిలో రికార్డు స్థాయిలో 1,400వాల్టా అనుమతులు
- ఇప్పటి వరకు 26అక్రమ పర్మిట్లు వెలుగులోకి
- ఇతర అటవీ డివిజన్లకు ఖమ్మం నుంచే జారీ
- అక్రమాలపై సమీక్షించిన చీఫ్ కన్జర్వేటర్


6

ఖమ్మం కార్యాలయంలో విచారణ చేస్తున్న అధికారి

కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉంది అక్రమ కలప పర్మిట్ల వ్యవహారం. అలాగే అటవీశాఖలోని అక్రమార్కులపై తీసుకుంటున్న క్రమశిక్షణ చర్యల తీరు కూడా చర్చనీయాంశంగా మారుతోంది. వాల్టా పర్మిట్ల జారీలో జరిగిన అవకతవకలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారాయి.

'విడత'లు
తారుమారు!

- జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై గందరగోళం
- అధికారులు పంపించిన గ్రామాల జాబితా ఒకటి
- ఎన్నికల వెబ్‌సైట్‌లో ప్రకటించింది మరొకటి
- నేడు స్పష్టత ఇవ్వనున్న కలెక్టర్ అనుదీప్



ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు నిర్ణయించిన విడతలు తారుమారయ్యాయి. 571 పంచాయతీల్లో మూడు దశల్లో ఎన్నికలను నిర్వహించాలని కలెక్టర్ ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్‌కు సెప్టెంబర్ 26,27 తేదీల్లో నివేదించారు. ఎన్నికల అధికారులకు పంపించిన ఆ నివేదికల ప్రకారం కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, ముదిగొండ, నేలకొండపల్లి, కామేపల్లి మండలాల్లో తొలివిడత, ఏన్కూరు, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు సింగరేణి మండలాల్లో రెండో విడత, రఘునాథపాలెం, కొణిజర్ల, వైరా, ఎర్రుపాలెం, మధిర, బోనకల్, చింతకాని మండలాల్లో మూడో విడత నిర్వహించేలా షెడ్యూల్ ఖరారు చేసి కలెక్టర్ సంతకంతో పంపించారు. అయితే ఎన్నికల వెబ్‌సైట్‌లో మాత్రం అధికారులు ప్రకటించిన జాబితాలో మూడో విడతలో సూచించిన మండలాలను మొదటి విడతగా, రెండో విడత మండలాల్లో మూడో విడతగా, మూడో విడత మండలాలను మొదటి విడతలో నిర్వహించేలా కనిపిస్తున్నట్టు సమాచారం. దీంతో జిల్లా అధికారులు అవాక్కయ్యారు. విడతల వారీగా నిర్వహించే ఎన్నికల తీరు ఎలా మారిందనే విషయమై అధికారులు ఆరా తీస్తున్నారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా మార్చేది లేదని స్పష్టం చేసినట్టు సమాచారం. దీంతో పంచా యతీ ఎన్నికలను ఎన్నికల వెబ్‌సైట్‌లో ప్రకటించిన విధంగా మార్పు తున్నట్లు తెలుస్తోంది. దీనిపై బుధవారం జిల్లా అధికారులు రాజకీయపార్టీల నేతలతో సమావేశాన్ని నిర్వహించనున్నట్టు సమాచారం.

ట్రాన్స్‌మిషన్ అసెస్‌మెంట్ సర్వేపై శిక్షణ

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : లింఫాటిక్ ఫైలేరియాసిస్ నిర్మూలనలో.. ట్రాన్స్‌మిషన్ అసెస్‌మెంట్ సర్వే కీలకమైన దశ అని జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.కళావతీబాయి తెలిపారు. ఈ సర్వే ద్వారా వ్యాధి వ్యాప్తి ఎలా ఉందని అంచనా వేసి, సమాజంలో ఇన్ఫెక్షన్ ఏ దశలో ఉందో నిర్ధారించుకోవచ్చన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా మలేరియా అధికారి ఆధ్వర్యంలో, జాతీయ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని మెడికల్ ఆఫీసర్లు, పారామెడికల్ సిబ్బందికి ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ బృందాలు, మెడికల్ ఆఫీసర్లు, ఫీల్డ్ సిబ్బంది చేస్తున్న కృషిని డీఎంహెచ్‌వో అభినందించారు. శిక్షణలో సర్వే విధానం, శాంప్లింగ్ పద్ధతి, ఫీల్డ్ డేటా సేకరణ, ఫలితాల విశ్లేషణ లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో వెంకటరమణ, రాష్ట్ర ఎన్‌సీవీబీడీసీ కార్యాలయ నిపుణులు, సాంకేతిక బృంద సభ్యులు శిక్షణనిచ్చారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో చందునాయక్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామారావు, మెడికల్ ఆఫీసర్లు, పారామెడికల్ సూపర్వైజర్, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

» భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

మణుగూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని దీంతో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం లభిస్తుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. మంగళవారం మణుగూరు ప్రభుత్వ ఐటిఐ ప్రాంగణంలోని ఏటీసీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏటీసీలో జరుగుతున్న పెండింగ్ పనులను తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ కోసం వృత్తి నైపుణ్యాలపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీ రవి, సూపరింటెండెంట్ జ్యోతి రాణి, ఏటీవోలు శ్రీనివాసరావు, జీవి కృష్ణారావు, నర్సయ్య, వేణుగోపాల్, ఏటీసీ సిబ్బంది పూర్ణచందర్ రావు, అశోక్, శ్రావణి, చందు తదితరులున్నారు.

స్థానిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

» భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు పోలీస్ అధికారులకు సూచించారు. మంగళవారం కొత్తగూడెం డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించగా డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ ఎస్పీకి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సమస్యాత్మక వ్యక్తులను గుర్తించి వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ అన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాధితులకు అండగా ఉంటూ పోలీస్ శాఖపై మరింత నమ్మకాన్ని పెంచేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. సబ్ డివిజన్ పరిధిలో గల అన్ని పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సబ్ డివిజన్ పరిధిలో గల అన్ని పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న పలు కేసుల వివరాల ను అడిగి తెలుసుకున్నారు. సబ్ డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఎటువంటి నేరాలు జరుగకుండా ప్రతి ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారీన పడకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం వన్‌టౌన్, టూటౌన్, త్రీ టౌన్, చుంచుపల్లి సీఐలు కరుణాకర్, ప్రతాప్, శివప్రసాద్, వెంకటేశ్వర్లు, ఎస్‌హెచ్‌వోలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి

జిల్లా ఎస్పీ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఆర్ఐలు సుధాకర్, లాల్‌బాబు, కృష్ణారావు, కార్యాలయ ఏవో మంజ్యానాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మందులు పిచికారీ చేయొద్దు

» ఖమ్మం జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య



పత్తిపంటను పరిశీలిస్తున్న డీఏవో పుల్లయ్య

కారేపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విచ్చలవిడిగా రసాయన మందులను వినియోగించొద్దని జిల్లా వ్యవసాయ శాఖాధికారి దనసరి పుల్లయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాణిక్యారం గ్రామంలో మంగళవారం వరి, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రధానంగా వ్యవసాయ శాఖ అధికారులు సూచిన, సలహాల మేరకే మందులు పిచాకారి చేయాలన్నారు. విచ్చలవిడిగా మందులు పిచికారి చేయడం వల్ల పంటలు దిగుబడి కంటే అధిక నష్టం వాటిల్లే పరిస్థితి దాపురిస్తుందన్నారు. ప్రభుత్వం రైతులు పండించిన పంటలైన పత్తి, వరికి మద్ధతు ధర ప్రకటించిందన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయశాఖాధికారి బట్టు అశోక్ కుమార్ ఉన్నారు.

అటవీశాఖలో..

అక్రమార్కులకు సం‘రక్షణ’!

» వివాదాస్పదంగా మారిన కలప రవాణా పర్మిట్ల వ్యవహారం

» ఏడాదిలో రికార్డు స్థాయిలో 1,400వాల్టా అనుమతులు

» ఇప్పటి వరకు 26అక్రమ పర్మిట్లు వెలుగులోకి

» ఇతర అటవీ డివిజన్లకు ఖమ్మం నుంచే జారీ

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉంది అటవీశాఖలోని జిల్లా అక్రమ కలప పర్మిట్ వ్యవహారం. అక్రమార్కులపై క్రమశిక్షణ చర్యల తీరు చర్చనీయాంశంగా మారుతోంది. జాతీయ స్థాయిలో వాల్టా పర్మిట్ల జారీలో ఖమ్మం జిల్లా ముందు వరుసలో ఉంది. ఉమ్మడి తెలుగురాష్ట్రాల్లో అయితే ఏకంగా ప్రథమ స్థానం దక్కించుకొంది. ఈ క్రమంలో అపకీర్తి దక్కించుకొంది. అయితే ఖమ్మం రేంజ్ పరిధిలోని చింతకాని బీట్ ఆఫీసర్ ద్వారా జిల్లాలోని ఇతర రేంజ్‌లోని వారికి అనుమతులు జారీ చేశారు. కానీ క్రమశిక్షణ చర్యల విషయంలో మాత్రం ఒక్క బీట్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవటం వెనుక ఎవరి సం‘రక్షణ’ ఉందన్న చర్చ అటవీశాఖలో జరుగుతోంది. ఇదిలా ఉంటే సస్పెండ్ అయిన ఆ ఉద్యోగి.. కలిసి గాంధీ జయంతి రోజున ఓ ఆలయంలో జంతుబలి చేసి ఆ మాంసాన్ని కొందరు అధికారులు, తోటి సిబ్బందితో పంచుకున్నారన్న సమాచారం మరింత చర్చకు దారి తీసింది.

రికార్డు స్థాయిలో వాల్టా అనుమతులు

వాల్టా అనుమతుల జారీలో ఖమ్మం జిల్లా జాతీయ స్థాయిలో ముందు వరసలో ఉండగా తెలుగురాష్ట్రాల్లో ప్రథమ స్థానం దక్కించుకొంది. మొత్తం 1,400 వరకు వాల్టా అనుమతులు జారీ చేశారు. ఖమ్మం ఇల్లెందు ప్రధాన రహదారి, బోనకల్ ఖమ్మం రహదారి, ఇలా జిల్లాలోని ప్రధాన రహదారుల వెడల్పు సందర్భంగా 800 వాల్టా అనుమతులు జారీ చేశారు. తర్వాత రైతుల పేరుతో మరో 600 వాల్టా అనుమతులు జారీ చేశారు. ఇలా రైతుల పేరుతో జారీ చేసిన అనుమతుల్లో మంగళవారం వరకు 26అక్రమ పర్మిట్లు వెలుగులోకి వచ్చాయి.

ఖమ్మం రేంజ్‌తో పాటు..

ఖమ్మం అటవీరేంజ్‌తో పాటుగా ఇతర డివిజన్ల ద్వారా అక్రమ కలప రవాణా నేషనల్ పర్మిట్లు అనుమతులు జరిగాయి. ఇతర డివిజన్లు అధికారులు కూడా నిబంధనలకు విరుద్ధంగా అక్రమ పర్మిట్‌లో అఖండుడుగా ఖ్యాతి పొందిన చింతకాని బీట్ ఆఫీసర్ ద్వారానే పర్మిట్లు జారీ చేశారు. ఇతర డివిజన్ల అధికారులు సంబంధం లేని బీట్ ఆఫీసర్‌తో ఎందుకు పర్మిషన్లు ఇచ్చారనే విషయంపై మాత్రం నాన్చుడి ధోరణిగా వ్యవహరిస్తున్నారు. అయితే విచారణలో ఇప్పటి వరకు 26 అక్రమ పర్మిట్లు బయటకొచ్చాయి. భవిష్యత్‌లో మరి కొన్ని బయటకు వచ్చే అవకాశం ఉంది. కాని అక్రమ కలప అనుమతుల విషయంలో చర్యలు తీసుకుంటున్న అధికారులు ఇతర డివిజన్ల అధికారుల పాత్రపై సరైన చర్యలు తీసుకోవటం లేదన్నే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సెక్షన్ ఆఫీసర్లు, డీఆర్వోలు, ఎఫ్ఆర్వోలకు తెలిసి అనుమతులు జారీ జరిగాయని అక్రమంగా వచ్చిన డబ్బుల్లో వారు వాటాలు తీసుకున్నట్లు విమర్శలు వెలువడుతున్నాయి.

ముమ్మర విచారణలో అధికారులు

కలప అక్రమ రవాణా విషయం వెలుగులోకి రావటంతో వారం రోజులుగా జిల్లా అటవీశాఖ అధికారుల నుంచి కార్యాలయం సిబ్బంది వరకు ముమ్మర విచారణలో నిమగ్నమయ్యారు. ఉదయం నుంచి రాత్రి వరకు కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం జాతీయ అటవీశాఖ విజిలెన్స్ అధికారులు ఖమ్మం కార్యాలయానికి వచ్చి జిల్లా అటవీశాఖ అధికారులతో సమావేశమయ్యారు. అక్రమ పర్మిట్ల జారీ విషయంపై వివరాలు సేకరించారు. కాగా మంగళవారం అటవీశాఖ రాష్ట్ర విజిలెన్స్ డీఎఫ్‌వో ముకుంద్‌రెడ్డి, ఇతర అధికారులు ఖమ్మం ఎఫ్‌ఆర్వో విభాగలో విచారణ చేపట్టారు. జిల్లాలోని ఇతర డివిజన్ల సిబ్బందిని పిలిపించారు. గత ఏడాది కాలంలో ఎన్ని వాల్టా అనుమతులు జారీ చేశారు. ఎక్కడ నుంచి ఎక్కడకు కలప రవాణా జరిగిందనే వివరాలను నమోదు చేశారు. మొత్తం 1,400 పర్మిట్లుపై విచారణ చేపట్టారు. ఒక కంప్యూటర్ ఆపరేటర్ సెల్ఫ్ ఎసెస్‌మెంట్‌కు అనుమతికి ఆన్‌లైన్ తర్వాత పైస్థాయిలోని అధికారులకు ఎందుకు పరిశీలించలేదని, ఒకే జిల్లా నుంచి వందల పర్మిట్లు జారీ జరిగితేపై స్థాయిలోని అధికారులు ఎందుకు గుర్తించలేదని విచారణ ప్రారంభించారు. అవసరమైతే మరి కొన్ని రోజులు పాటు ఖమ్మంలోనే ఉండి పూర్తిస్థాయిలో అక్రమ కలప పర్మిట్లు గుట్టు రట్టు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది.



అక్రమాలపై సమీక్షించిన చీఫ్ కన్జర్వేటర్

ఖమ్మం జిల్లాలో అక్రమ కలప అనుమతుల జారీ విషయంపై వరంగల్ చీఫ్ కన్జర్వేటర్ డాక్టర్ ధరావత్ భీమానాయక్ ఖమ్మం డీఎఫ్వో కార్యాలయంలో సమీక్షించారు. జిల్లాలో జరిగిన కలప పర్మిషన్లపై ఎఫ్‌డీవోలు, ఎఫ్ఆర్వోలు, కంప్యూటర్ అపరేటర్లు, కార్యాలయ పర్యవేక్షకులతో మాట్లాడారు. నేషనల్ ట్రాన్సిట్ పాస్ సిస్టమ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సెల్ఫ్ ఎసెస్‌మెంట్ ద్వారా జరిగే అక్రమాలపై భవిష్యత్‌లో తీసుకోవాల్సిన మార్పులు చేర్పులపై నాలుగు గంటల పాటు సమీక్షించారు. టేకు తరహాలో ఇతర కలప రవాణాకు ఓటీపీ విధానం రావాలని అటవీశాఖ అధికారులు సూచనలు చేశారు.

వివాదాస్పంగా సస్పెండ్ అయిన ఉద్యోగి తీరు

కలప అక్రమ రవాణాలో సస్పెన్షన్‌కు గురైన బీట్ ఆఫీసర్‌తో.. గాంధీ జయంతి రోజున అటవీశాఖలో ఇంకా ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు కలిసి కార్యక్రమాలు చేయటం వివాదాస్పదంగా మారింది. ఓ దేవాలయం వద్దకు సస్పెన్షన్‌కు గురైన బీట్ ఆఫీసర్‌తో పాటు ఓ అధికారి, ముగ్గురు ఉద్యోగులు వెళ్లి జంతుబలి చేసినట్టు అటవీశాఖ అధికారుల అంతర్గత విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు మంగళవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ సంఘటనపై చర్యలు తీసుకుంటారా? లేదా? దాటవేత ధోరణితో వ్యవహరిస్తారా? అనే చర్చ జరుగుతోంది.

హైదరాబాద్‌ను మించి ఖమ్మం అభివృద్ధి..

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌ను మించి ఖమ్మం అభివృద్ధి జరుగుతుందని, ఇందుకు ప్రజలు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని 46వ డివిజన్‌లో రూ.1.60 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సారధినగర్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకులు కన్నం ప్రసన్నకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ఏ రాష్ట్రాల వారైనా ప్రశాంతంగా జీవించేలా ఖమ్మం గుమ్మాన్ని తీర్చిదిద్దుతామన్నారు. ఖమ్మం అభివృద్ధికి మరో రూ.300 కోట్లతో కార్యచరణ జరిగిందన్నారు. మారుమూల వీధుల్లోకి కూడా అంబులెన్స్‌లు వచ్చేలా రహదారుల వెడల్పుకు సహకరించాలని కోరారు. వరంగల్ జిల్లా పరిధిలో 4వేల జనాభాతో గ్రామ పంచాయతీగా ఉన్న ఖమ్మం.. ఇప్పుడు 4లక్షల జనాభాకు పెరిగి నగర పాలక సంస్థగా మారిందన్నారు. ఖమ్మానికి బైపాస్ రోడ్డు నిర్మాణం చేసినప్పుడు ఎందుకని ప్రశ్నించారని? ఇప్పుడు ఆదే బైసాప్‌లో ట్రాఫిక్ జామ్ అవుతోందని త్వరలో మరో రింగ్ రోడ్డును నిర్మాణం చేస్తానన్నారు. విద్యా, వైద్యం, శాంతి భద్రతలు ఇలా అన్ని విషయాల్లో దేశంలోనే నెంబర్ వన్ నగరంగా ఖమ్మం మారబోతుందని ఖమ్మం నగరంలో ఏ ప్రాంతం వారైనా ఒక నివాసం ఉండాలని ఆలోచన జరిగే రోజులు వచ్చాయన్నారు. ఎన్నికల సమయం వరకు రాజకీయాలు ఉంటాయని, తర్వాత ఎలాంటి కక్షలు, కార్పణ్యాలు ఉండవని, రాజకీయ కేసులు అస్సలే లేవన్నారు. కనీస కేసులు లేక పోవటంతో పోలీసులు ఖాళీగా ఉంటున్నారంటూ తుమ్మల తనదైన శైలిలో చెప్పటంతో సభలో ప్రజలు చప్పట్లు కొట్టారు. పిల్లలకు మంచి చదువు అందించేందుకు ఖమ్మం నియోజకవర్గంలో స్వామినారాయణ విద్యా సంస్థలు నిర్మాణం జరుగుతున్నాయన్నారు. నాయకులు, ప్రజా ప్రతినిధులు కూడా తమ నివాసాలు పోతాయని కాకుండా రహదారుల నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్పొరేటర్ కన్నం వైష్ణవి మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, ఖమ్మం ఏఎంసీ ఛైర్మన్ యరగర్ల హనుమంతరావు, వీవీపాలెం సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు, కాంగ్రెస్ నాయకులు పాలెపు వెంకటరమణ, షేక్ రజీ, బాల్దే నాగేశ్వరరావు, కన్నం రమేశ్, యన్నే రామకృష్ణ, దేవర వెంకన్న, లక్ష్మణ్, ఉప్పలయ్య, గెట్ల కృష్ణయ్య, కాటం కోమరయ్య, నారాటి బీరేష్, చల్లా రమేశ్, మధు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

విలీన ప్రాంతాల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల నుంచి ఖమ్మం నగరంలో విలీనమైన ప్రాంతాల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని, ముఖ్యంగా రెవెన్యూ సమస్యలతో పాటుగా ప్రజా ఆరోగ్యం మెరుగుపడాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యను ఆదేశించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన విలీన కష్టాలు వీడటం లే, మూణాళ్ల ముచ్చటే కథనాలపై మంత్రి స్పందించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో మంత్రి తుమ్మల సమీక్షించారు. విలీన ప్రాంతాల్లో ఇంటి నెంబర్లు, చేతి పంపుల కనెక్షన్లు, నివాసాల పేర్లు మార్పులు చేర్పులు ఇతర రెవెన్యూ సమస్యలపై పలు సూచనలు చేశారు. తక్షణం సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యలు పరిష్కారం జరిగితే ప్రజలకు వారి ఆస్తులపై హక్కులు లభిస్తాయని ఆదే సమయంలో ఖమ్మం నగర పాలక సంస్థకు ఆదాయం కూడా పెరుగుతుందా కదా అన్నారు. గతంలో రెవెన్యూమేళాలో సేకరించిన దరఖాస్తులను పూర్తిచేయాలని సూచించారు. అలాగే వీధి వ్యాపారుల ప్రాంగణంపై కమిషనర్‌కు పలు సూచనలు చేశారు. పారదర్శకంగా మార్కెట్ నిర్వహణ జరపాలని వ్యాపారులు, ప్రజలకు అనుకూలంగా నిర్ణయాలు జరపాలని సూచించారు. మున్నేరు పరివాహకంలో నిర్మాణం జరుగుతున్న ప్రొటెక్షన్ వాల్‌ను క్రమపద్ధతిలో వరసగా నిర్మాణాలు జరపాలని, మధ్య మధ్యలో ఎందుకు వదిలిస్తున్నారని ప్రశ్నించారు. పనులను పర్యవేక్షణ చేయాలన్నారు. వర్షాలు తగ్గటంతో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. నగరంలో రహదారులపై పడిన గుంతలను వెంటనే పూడ్చి వేయాలని సూచించారు.

టీజీవో ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కొంగర



ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కొంగర వెంకటేశ్వర రావు ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఇటీవలె జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ పదవీ విరమణ పొందడంతో ఇప్పటివరకు ఖాళీగా ఉన్న అధ్యక్ష పోస్టుని కొంగర వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఆమోదించారు. అదే విధంగా ఇప్పటివరకు జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న మల్లెల రవీంద్ర ప్రసాద్ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. జిల్లా ట్రెజరర్ కొండపల్లి శేషు ప్రసాద్ రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నికయ్యారు. ఖాళీ అయిన ట్రెజరర్ పోస్ట్‌లో డాక్టర్ సూ రంపల్లి రాంబాబుని నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు నూతన సభ్యులను అభినందించారు.

ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని జిల్లా టీజీవో అధ్యక్షుడు కొంగ ర వెంకటేశ్వరరావు కార్యదర్శి మోదుగు వేల్పాద్రి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా ఎన్నికైన జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ మల్లెల రవీంద్రప్రసాద్, సూరంపల్లి రాంబాబు, కొండపల్లి శేషుప్రసాద్ తదితరులు కలెక్టర్‌ను కలిశారు. వారిని కలెక్టర్ అభినందించారు.



కలెక్టర్‌ను కలిసిన టీజీవో నూతన కమిటీ

వన రామయ్యకు నీరాజనం

(5వ పేజీ తరువాయి)



రావడంతో ఒక్కసారిగా రామాలయ పరిసరాలు శోభాయమానంగా దర్శనమిచ్చాయి. జై శ్రీరామ్ జై జై శ్రీరామ్ అంటూ రామనామ స్మరణ ఒక వైపు. మరో వైపు మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణలు శబరి స్మృతి యాత్రకు మరింత శోభనిచ్చాయి.. . . అత్యంత సంప్రదాయబద్దంగా సాగిన ఈ కార్యక్రమం భద్రాద్రి వాసులను ఎంతగానో ఆకట్టుకుంది. భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శబరి స్మృతి యాత్రలో భాగంగా తొలుత రామ లక్ష్మణులు, శబరి చిత్ర పటాన్ని పట్టుకోగా అగ్ర భాగాన సంప్రదాయ బద్ధంగా మేళతాళాలు, గిరిజనుల నృత్యాలు, కోలాటాలు నిర్వహించారు. ఈ క్రమంలో భద్రగిరిలో మూడుసార్లు గిరి ప్రదిక్షణ నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో పుష్పాలు, ఫలాలు, పత్రాలను తీసుకొని గిరిజన మహిళలు చిత్రకూట మండపం వద్దకు చేరుకొని అక్కడ భద్రాద్రి దేవస్థానం అర్చక స్వాములకు వాటిని అందజేశారు. ఇదే క్రమంలో ఒక వైపు శ్రీరామ షడాక్షరి సంపుటిత విశేష రామనామార్చన నిర్వహించగా అందుకు అనుగుణంగా వివిధ రకాల పూలతో స్వామి వారికి పుష్పార్చన నిర్వహించారు. ఇదే సమయంలో వివిధ రకాల ఫలాలను స్వామి వారికి నివేదన చేయడంతో పాటు హారతులతో స్వామికి పూజలు జరిపారు. చివరగా నివేదన చేసిన ప్రసాదాలు, పూజ చేసిన పుష్పాలను, శబరి స్మృతి యాత్ర లడ్డూ ప్రసాదంను గిరిజనులకు అందజేశారు. అలాగే దేవస్థానం తరపున 15 మంది గిరిజన దంపతులకు వస్త్రాలను పలువురు గిరిజన దంపతులకు ఐటీడీఏ పీవో బి.రాహుల్, దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావులు అందజేశారు. అదేవిధంగా గిరిజనులందరికి ఉచిత వసతి, భోజన సదుపాయంను కల్పించడంతో పాటు వారిని ప్రత్యేక బస్సుల్లో తిరిగి వారి గమ్యస్థానాలకు చేర్చారు. ఈ కార్యక్రమాల్లో భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్, దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవానీరామకృష్ణారావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, కత్తి శ్రీనివాస్, దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్ రాఘవాచార్య, అమరవాది గోపాలాచార్యులు సిబ్బంది పాల్గొన్నారు.

శోభాయామానంగా సాగిన గిరి ప్రదిక్షణ

మేళతాళాలు.. వేద పండితుల మంత్రోచ్చారణలు. . . .గిరిజన సంప్రదాయ నృత్యాలు.. కోలాటాల నడుమ గిరిజనుల భద్రగిరి ప్రదిక్షణ శోభాయామానంగా సాగింది. శబరి, రామ లక్ష్మణులు ఉన్న చిత్రపటాన్ని చేత పట్టుకొని నడుస్తుండగా అగ్ర భాగాన మేళతాళాలు, గిరిజనుల సంప్రదాయ నృత్యాలు, కోలాటాలు సాగాయి. ఇదే సమయంలో ప్రతి ఒక్కరి నోట జై శ్రీరామ్ జైజై శ్రీరామ్ అంటూ రామనామ స్మరణతో భద్రాద్రి పరిసరాలు భక్తి భావంతో పులకరించాయి. కాగా రాజా తూము లక్ష్మీ నరసింహదాసు, భక్తరామదాసు తానీషా, పోకల దమ్మక్క తదితర విగ్రహాలకు నూతన వస్త్రాలను ధరింపజేయడంతో పాటు పూజలు నిర్వహించారు.

పుష్పాలు, ఫలాలతో ప్రత్యేకపూజలు

శబరి స్మృతి యాత్రలో అందరిని ఆకట్టుకున్న దృశ్యం పుష్పం, ఫలాలే. అలనాడు రామ లక్ష్మణులకు శబరి ఏ విధంగా అడవిలో లభించే ఫలాలను ఇచ్చిందో అదే రీతిలో శబరి స్మృతి యాత్రలో దేవస్థానం అధికారులు అలనాటి శబరిని గుర్తు చేస్తూ వివిధ రకాల ఫలాలను గిరిజన మహిలకు అందించగా వారు ఆలయం నుంచి చిత్రకూట మండపం వద్దకు వచ్చి రామయ్య పూజా కార్యక్రమాలకు వాటిని సమర్పించారు. వెలగ పండు, రేగుపండు, అరటిపండ్లు, నారింజ, బత్తాయి, దానిమ్మ, ద్రాక్ష, యాపిల్, సీతాఫలాలు పండ్లను సమర్పించారు. అదేవిధంగా పుష్పాల్లో గులాబీలు, చామంతులు, కనకాంబరాలు, మల్లెపూలు, సన్నజాజులు తదితర పుష్పాలను సమర్పించారు.

శబరి మాతకు అభిషేకం

ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా కూనవరంలో గోదావరి-శబరి సంగమం వద్ద మంగళవారం శబరి స్మృతి యాత్రలో భాగంగా భద్రాద్రి దేవస్థానం ముఖ్య అర్చకులు పొడిచేటి రామభద్రాచార్యులు శబరిమాతకు పంచామృతాభిషేకం సంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, నెయ్యి తదితర ద్రవ్యాలతో శబరిమాతకు అభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.



గిరిజన దంపతులకు వస్త్రాలను అందజేస్తున్న పీవో రాహుల్



పుష్పాలు, ఫలాలతో చిత్రకూట మండపానికి వస్తున్న దృశ్యం



గిరి ప్రదక్షిణలో గిరిజన సంప్రదాయ నృత్యాలు

వృక్ష విలాపం

» ట్రీ కటింగ్ పేరుతో చెట్లు తొలగింపు

» ట్రాన్స్‌కో సిబ్బంది నిర్వాకం పట్ల సర్వత్రా ఆక్షేపణలు





ఐటీడీఏ రోడ్డులో నరికివేసిన చెట్లు

భద్రాచలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ట్రాన్స్‌కో సిబ్బంది ఐటీడీఏ రహదారిలో ట్రీ కటింగ్ పేరుతో చెట్లు నరికివేయడం పట్ల సర్వత్రా ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం ఉదయం 9 నుంచి 11 గం టల వరకు ఐటీడీఏ రహదారిలో ఎన్నో ఏళ్ల నుంచి పెరిగిన చెట్లను మొదళ్ల వరకు నరికివేశారు. విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతుందనే కారణంతో ట్రీ కటింగ్ నిర్వహించడం పట్ల ఎవరు అభ్యంతరం చెప్పడం లేదు. అయితే ట్రాన్స్‌కో సిబ్బంది వాస్తవానికి వైర్లకు తాకే చెట్ల కొమ్మలను మాత్రమే తొలగించాల్సి ఉండగా పూర్తిగా చెట్లనే తొలగించడం ఎంత వరకు సమంజసమని ప్రకృతి ప్రేమికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఒక వైపు మొక్కలు నాటాలని పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రచారం చేస్తుండగా ట్రాన్స్‌కో సిబ్బంది మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ఐటీడీఏ రహదారిలో మంగళవారం జరిగిన ట్రీ కటింగ్‌లు పలు చెట్లను ఈ విధంగా ట్రాన్స్‌కో సిబ్బంది తొలగించారు. ఇదే రీతిలో దాదాపుగా దుకాణాలు, ఇళ్ల ముందు ఉన్నాయనే సాకుతో చెట్లను తొలగించడం ఇటీవల కాలంలో ఎక్కువగా జరుగుతోందని ప్రకృతి పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు. ట్రాన్స్‌కో సిబ్బంది వ్యవహరించిన తీరు ఉన్నతాధికారుల దృష్టికి ప్రకృతి పర్యావరణ ప్రేమికులు ఇప్పటికే తీసుకెళ్లారు.

కొత్త మార్గదర్శకాలతో 'ఉపాధి'

జాబ్‌కార్డుతో పాటు
ఆధార్ అనుసంధానం తప్పనిసరి
ఉపాధి పని వేళకు
కార్మికుల ఐరిష్ నమోదు
వారం రోజుల్లో ఈకేవైసీ పూర్తి
చేయాలి : అదనపు ఆర్డీవో రవి

'ఉపాధి హామీ'లో బోగస్ మస్టర్లకు ఇక చెక్..


ఉపాధి పనులు చేస్తున్న కార్మికులు

కొత్తగూడెం అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి పనులకు అనుకూలంగా ఉన్న వారంతా పని సమయంలో రాకపోయినా క్షేత్రస్థాయిలో కొందరు ఉపాధి హామీ సహాయకులు వారి హాజరు నమోదు చేస్తూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద కేటాయించిన నిధులను స్వాహా చేసేవారు. ప్రతి రోజూ పనిచేసే కూలీలకు సగటు వేతనం రూ.310 దక్కడం లేదని స్థానికంగా ఆరోపణలు ఉన్నాయి. ఈ అవకతవకలపై ఉన్నతాధికారులకు కార్మికుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలో "నరేగా" పద్దు దుర్వినియోగం కాకుండా ఉండాలనే సదుద్దేశ్యంతో కేంద్రం ఉపాధి హామీ పథకం తీరుతెన్నుల్లో నూతన మార్గదర్శకాల అమలుకు శ్రీకారం చుట్టింది. దీంతో బోగస్ మస్టర్లకు చెక్ పెట్టాలని నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో అవినీతికి పాల్పడకుండా జాబ్‌కార్డులు పొందిన కార్మికుల కుటుంబసభ్యులతో కచ్చితంగా ధ్రువీకరణ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఈకేవైసీ చేస్తున్నారు.

ఈకేవైసీ ప్రక్రియతో నమోదు తీరుతెన్నులు ఇలా..

జాతీయ మస్టరు పర్యవేక్షణ వ్యవస్థ (ఎన్ఎంఎంఎస్) యాప్‌లో ఈకేవైసీ నమోదు చేయాలి. కార్మికుల జాబ్‌కార్డులను ఎంపిక చేసుకుని ఆధార్ కార్డును అనుసంధానం చేయాలి. అంతేకాక కార్మికుల కనుపాప (ఐరిష్) నమోదు చేయాలి. నమోదు ప్రక్రియ తర్వాత ఒకరికి బదులుగా మరొకరు పనికి వచ్చే అవకాశం ఉండదు. మృతుల పేర్లు నమోదు చేసే వీలు కుదరదు. దీంతో ఎక్కువ మంది పనికి వచ్చినట్లు ఇష్టారాజ్యంగా మస్టర్లు రాయలేరు. జిల్లాలో మొత్తం 2.23 లక్షల జాబ్‌కార్డులు ఉండగా.. ఉపాధిహామీ పథకంలో పని కావాలని మొత్తం 4.59 లక్షల మంది అడిగారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద నమోదైన వారిలో 2,21,021 మంది కార్మికులు యాక్టివ్‌గా ఉన్నారు. నేటి వరకు 38.65 శాతంతో 78,631 మంది కార్మికుల వివరాలను ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేసి ఎన్ఎంఎంఎస్ యాప్‌లో అధికారులు నమోదు చేశారు.

ఈకేవైసీ వారంలో పూర్తిచేయాలి

జిల్లాలో ఉపాధి కార్మికుల ఈకేవైసీ ప్రక్రియను వారంలోగా పూర్తిచేయాలని అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం.. తద్వారా పని అడిగిన వారందరికీ ఉపాధి పని కల్పిస్తాం. నకిలీ మస్టర్లకు తావులేకుండా అర్హులైన కూలీలకు వంద రోజులు పని కల్పించేందుకు కృషి చేస్తాం.

- రవి, అదనపు డీఆర్డీవో

ఓట్ల చోరీపై సంతకాల సేకరణ


మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మం అర్బన్ అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి) : ఓట్ల చోరీపై సంతకాల సేకరణకు కాంగ్రెస్ నాయకులు నడుంబిగించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో నిర్వహించిన మండల, పట్టణ, బ్లాక్ అధ్యక్షులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఓట్ల దొంగలు గద్దెదిగండి' అనే నినాదంతో ప్రారంభించిన ఉద్యమం బలోపేతం కావాలన్నారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడటమే బీజేపీ చేసిన అతిపెద్ద పని అని ఆరోపించారు. ఎన్నికలను ప్రభావితం చేయటానికి బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణలు చేపట్టారన్నారు. ఏడాది క్రితం చేపట్టాల్సిన సవరణ ప్రతిపక్ష ఓట్లను తొలగించే ఉద్దేశ్యంతో ఇప్పుడు ప్రారంభించారన్నారు. ఎన్నికల కమిషన్ తనకు గల రాజ్యాంగ ప్రతిపత్తిని దుర్వినియోగం చేస్తోందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ జావెద్, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, బ్లాక్ అధ్యక్షుడు యర్రం బాల గంగాధర్ తిలక్, నాయకులు బోజెడ్ల సతీష్, దగ్గుల రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలోని తెలుగు చిన్నారులకు 'బాలదత్త'


అమెరికాలో వేమన శతకం పుస్తకాలతో చిన్నారులు

సత్తుపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని తెలుగు కుటుంబాల వారు తమ పిల్లలకు మాతృభాషను బోధించే క్రమంలో వేమన శతక పద్యాలను నేర్పించే బాలదత్త కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. సత్తుపల్లికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు అయ్యదేవర శేషగిరిరావు, మాదిరాజు మాలతి దంపతులు అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం డల్లాస్ పట్టణంలోని కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో సృజన సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో పంపిన వేమన శతకం పద్య పుస్తకాలను అందజేశారు. శ్రీ గణపతి సచ్చిదానందస్వామి స్థాపించిన ఈ దేవాలయంలో బాలదత్త కార్యక్రమాన్ని ప్రతి ఆదివారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాల రామాయణం, బాలభారతం వంటి పురాణాలతో పాటు మాతృభాషను కూడా నేర్పుతున్నట్లు నిర్వహకులు చెప్పారు. వేమన శతకంతో పాటు బాలసాహితీవేత్త పురిమళ్ల సునంద రాసిన తెలుగుభాషా వాచకాలను స్వచ్ఛంద శిక్షకులు దీప్తి, శరణ్యలకు అందజేశారు. కార్యక్రమంలో సాయిప్రకాష్, కౌశిక్, తెలుగు కుటుంబాల వారు పాల్గొన్నారు.

డీఎస్పీ విష్ణుమూర్తికి ఘన నివాళి


డీఎస్పీ విష్ణుమూర్తి మృతదేహంపై పూలమాల వేస్తున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు


విష్ణుమూర్తి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్

ఎమ్మెల్యేలతో పాటు
పోలీస్ ఉన్నతాధికారుల సంతాపం
అధికారిక లాంఛనాలతో
అంత్యక్రియలు

జూలూరుపాడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో హఠాన్మరణం చెందిన సబ్బతి విష్ణుమూర్తికి పలువురు ఘన నివాళ్లర్పించారు. ఈ మేరకు విష్ణుమూర్తి అంత్యక్రియలను మంగళవారం ఆయన స్వగ్రామం జూలూరుపాడు మండలంలోని వెంగన్నపాలెంలో అంతిమయాత్ర జరిపి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు విష్ణుమూర్తి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆయన మృతిపట్ల కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి, ఎస్సై బాదావత్ రవిలు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. పలు పార్టీల నాయకులు విష్ణుమూర్తి మృతదేహన్ని సందర్శించి నివాళ్లు అర్పించారు.

డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఏర్పాటుకు సర్వే


భూమి సర్వే చేస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

చంద్రుగొండ, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రధాన కాలువ నుంచి డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఏర్పాటు చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు సర్వే పనులను ప్రారంభించారు. ఈమేరకు మంగళవారం జేఈ దయాకర్‌రెడ్డి పర్యవేక్షణలో సర్వేయర్లు ప్రియాంక, లక్ష్మణ్‌రావు, సిబ్బంది మండలంలోని బెండాలపాడు శివారులో సర్వే ప్రారంభించారు. చంద్రుగొండ, దామరచర్ల, మద్దుకూరు, గురాయిగూడెం, రావికంపాడు, పోకలగూడెం, గానుగపాడు గ్రామాల పరిధిలో ఈసర్వే నిర్వహించిన అనంతరం పంటకాలువలకు కావాల్సిన నాలుగు వందల ఎకరాల భూముల వివరాలను రెవెన్యూ శాఖకు అందజేయనున్నట్లు సర్వే అధికారులు తెలిపారు.

16,678 ఎకరాలకు సీతారామ నీరు

సీతారామ కాలువ పనులు పూర్తయిన అనంతరం మండలంలో దాదాపు అన్ని భూములకు సాగునీరు అందనున్నట్లు సీతారామ కాలువ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అధికారిక లెక్కల ప్రకారం మండలంలో 17 వేల ఎకరాలకు పైగా భూమి సాగులో ఉండగా ఏడు డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ ద్వారా 16,678 ఎకరాలకు సీతారామ ప్రాజెక్టు కాలువ ద్వారా సాగునీరు అందుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మండలం అంతటా గోదావరి నీరు పారుతుండటంతో ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రతీ గడపలో బీజేపీ నినాదం వినిపించాలి

పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు

ఖమ్మంబైపాస్‌రోడ్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతపార్టీ విధానం ప్రతి గడపలో వినిపించాలని ప్రజల మనస్సుల్లో విశ్వాసం నింపాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఇటీవల నూతనంగా నియమితులైన జిల్ల కార్యవర్గసభ్యులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో కలిసి పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. ఆరు గ్యారంటీల అమలోలు ఆ పార్టీ విఫలమైందన్న విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పోటీ ఖాయమన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు, గుత్తా వెంకటేశ్వరావు, నాయుడు రాఘవరావు, నలగట్టు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ భద్రాద్రి జిల్లా ఇన్‌చార్జ్‌గా నాగేశ్వరరావు


పొద్దుటూరి నాగేశ్వరరావు

ఇల్లెందు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి, ఆర్యవైశ్య సంఘం ఇల్లెందు మండల అధ్యక్షుడు పొద్దుటూరి నాగేశ్వరరావు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ జిల్లా ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్యవైశ్యుల అభ్యున్నతి కోసం కృషిచేస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన నాగేశ్వరరావుకు పదవీ లభించడం పట్ల పట్టణ ఆర్యవైశ్యులు, ప్రముఖులు, వ్యాపార వర్గాలు హర్షం వ్యక్తం చేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆర్యవైశ్య ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఈ మేరకు నాపై నమ్మకం ఉంచి ఈ పదవీని అప్పగించిన చైర్మన్ కల్వ సుజాతకు, ఎమ్మెల్యే కోరం కనకయ్యకు, ఆర్యవైశ్య సమాజానికి ధన్యవాదాలు తెలిపారు. ఆర్యవైశ్యుల సంక్షేమం, విద్య, ఉపాధి రంగాల్లో నూతన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

వరి పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు


పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ముదిగొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం వల్లాపురంలో వరి పొలాలను వైరా కేవీకే శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని తాటికొండ రమేష్‌కు చెందిన పొలంలో సుడిదోమ, బ్యాక్టీరియా, ఎండు తెగుళ్లు, ఆకు ముడతను శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రస్తుత సీజన్‌లో వరి పొలాలకు చీడపీడలు సోకుతున్నందున వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సుచరితాదేవి, పావని, వాసిరెడ్డి చైతన్య, పణిశ్రీ, ఏవో సరిత, రైతులు పాల్గొన్నారు.

రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు

దుమ్ముగూడెం అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గేదెలను మేపేందుకు వెళ్లి గుబ్బలమంగి వాగులో ప్రమాదవశాత్తూ పడి మృతిచెందిన చినబండిరేవుకు చెందిన పొనెగొండ వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసినట్లు తహసీల్దార్ అశోక్‌కుమార్ మంగళవారం తెలిపారు. సెప్టెంబరులో సంభవించిన ప్రకృతి వైపరీత్యాల కారణంగా వెంకన్న మృతిచెందినట్లు తహసీల్దార్ నివేదిక పంపగా కలెక్టర్ ఎక్స్‌గ్రేషియా విడుదల చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

బోనకల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోనకల్ బీసీసీ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాల య్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం- బోనకల్ రోడ్డులో విద్యుత్‌లైన్ మరమ్మతులు చేసేందుకు గానూ పనులు చేస్తున్న ట్రాక్టర్‌కు పంక్చర్ అయింది. అదే సమయంలో ముష్టికుంట్ల గ్రామానికి చెందిన దోసపాటి శశిధర్, బోయిన కొండలు ద్విచక్రవాహనంపై బోనకల్ నుంచి తమ గ్రామానికి వస్తుండగా ట్రాక్టర్‌ను రోడ్డుపై నుంచి వెనుకకు తీస్తున్న క్రమంలో బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనదారులిద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో... 108 సిబ్బంది కోట బాను సహన్, ఎంఎం చక్రవర్తిలు ప్రథమ చికిత్సచేసి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భార్యను హతమార్చి.. భర్త ఆత్మహత్య

దంపతుల మధ్య చిచ్చురేపిన మద్యం
తాగుడికి బానిసై వేధిస్తున్న భర్త
ఇద్దరి మధ్య పెరిగిన మనస్పర్థలు
పాపకొల్లు ముత్యాలమ్మ కాలనీలో విషాదం..


గోపి, సునీత (ఫైల్)

జూలూరుపాడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్యం మహమ్మారి ఆ దంపతుల మధ్య చిచ్చు పెట్టింది. భర్త మద్యానికి బానిసవడంతో వారి మధ్య మనస్పర్థలు పెరిగాయి. భర్త కొంత కాలంగా భార్యను వేధించ సాగాడు. మద్యం తాగేందుకు డబ్బులివ్వాలని కొట్టేవాడు. ఇలా వారి మధ్య తరచూ గొడవలు జరుగుతుండగా.. చివరకు సోమవారం రాత్రి భార్యను కత్తితో పొడిచి హతమార్చి.. పరారై.. తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం పాపకొల్లు ముత్యాలమ్మ కాలనీలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలివీ..

జూలూరుపాడు మండలం పాపకొల్లు పంచాయతీ ముత్యాలమ్మ కాలనీకి చెందిన ధారావత్ గోపి (44)కు.. టేకులపల్లి మండలం ముత్యాలంపాడుకు చెందిన సునీత(35)కు 17 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి గౌరి, గీతాంజలి ఇద్దరు కుమార్తెలున్నారు. వారి కాపురం సజావుగా సాగుతుండగా.. కొంతకాలం నుంచి గోపి మద్యానికి బానియ్యాడు. భార్య వ్యవసాయ పనులకు వెళుతూ ఉంటుంది. ఈ క్రమంలో గోపి మద్యం తాగేందుకని తరుచూ భార్యను డబ్బులు ఇవ్వాలని వేధించడం, ఆమె డబ్బులు ఇవ్వకపోతే తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ కొడుతుండేవాడు. ఒక్కోసారి అతని వేధింపులు తట్టుకోలేక భార్య బంధువుల ఇళ్లలో తలదాచుకునేది. ఈ నేపథ్యంలో పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు పెట్టి పద్ధతి మార్చుకోవాలని గోపికి సూచించారు. అయినా అతడి తీరు మారలేదు. సోమవారం ఉదయం గోపి, సునీత ఇద్దరూ కలసి తమ ద్విచక్ర వాహనంపై తాము కౌలుకు తీసుకుని సాగుచేసిన పత్తి పొలానికి వెళ్లారు. సాయంత్రం వరకు ఇద్దరూ పనులు చేశారు. అనంతరం అక్కడ ఏం జరిగిందో ఏమో తెలియదు కాని గోపి పోటకత్తితో భార్య తలపై నరికి హత్య చేసి.. పరారయ్యాడు. కాగా సాయంత్రమైనా తల్లిదండ్రులు ఇంటికి రాకపోవడంతో వారి ఇద్దరు కుమార్తెలు ఆందోళనకుగురై బాబాయి గన్యాకు చెప్పారు. దీంతో గన్యా పొలం వద్దకు వెళ్లి చూడగా వదిన సునీత రక్తపుమడుగులో పడిఉంది. దీంతో ఆయన విషయాన్ని తమ బంధువులకు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలను నమోదు చేసుకున్నారు. మృతురాలి తండ్రి బానోత్ రాందాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

భయంతోనే ఆత్మహత్య..!

భార్యను హత్యచేసి పరారైన గోపి పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సునీత హత్య తర్వాత అతడి కోసం పోలీసులు, బంధువులు గాలించడం ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం జూలూరుపాడు మండలంలోని రాజారావుపేట గ్రామ సమీపంలో ఓ రైతుకు చెందిన పొలంలో గోపి పురుగుమందు తాగి అపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని అటుగా వెళుతున్న ఓ రైతు, వ్యవసాయ కూలీలు గుర్తించారు. వారు తమ గ్రామస్థులకు సమాచారమివ్వగా.. వారి ద్వారా విషయం తెలుసుకున్న గోపి బంధువులు అక్కడికి చేరుకున్నారు. అయితే గోపి అప్పటికే మృతిచెందడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ బాదావత్ రవి తన సిబ్బందితో కలసి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు గన్యా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకున్నారు.

పల్లవిని అభినందించిన ఎమ్మెల్యే సూర్యనారాయణ


పల్లవిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణ

ఖమ్మం రూరల్, అక్టోబర్ 7(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న మండలంలోని ఆరెంపుల గ్రామానికి చెందిన తాళ్లూరి పల్లవిని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గన్పాల్ సూర్యనారాయణ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావులు మంగళవారం అభినందించారు. ఎమ్మెల్యే సూర్యానారాయణ ఆరెంపులలోని పల్లవి ఇంటికి వచ్చి ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఫోన్‌లో పల్లవిని అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతు పల్లవి ఏఐపీలో ఆల్ ఇండియా టాపర్‌గా నిలవడం ఖమ్మం జిల్లాతో పాటు తెలంగాణకు, ఆమె తల్లిదండ్రులకు ఎంతో గర్వకారణమన్నారు. పల్లవి టాపర్‌గా నిలిచి పలువురికి ఆదర్శంగా నిలించిందని, మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

నూతన రామాలయ నిర్మాణానికి కృషి

ఏన్కూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరులోని నూతన రామాలయ నిర్మాణానికి గ్రామస్తులు కృషి చేస్తున్నారు. ఈమేరకు గ్రామస్తులు మంగళవారం చింతకాని మండలం నేరడలో రాతికట్టడంతో నిర్మిస్తున్న రామాలయాన్ని సుమారు 40మంది భక్తులు ఓ బస్సులో వెళ్లి దర్శించుకున్నారు. ఆలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ నిర్మిస్తున్న శిల్పాల వివరాలు తెలుసుకున్నారు. అదే తరహాలో ఇక్కడ ఆలయాన్ని త్వరగా నిర్మించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మేడ ధర్మారావు, తాళ్లూరి అప్పారావు పొన్నం హరికృష్ణ, మాదినేని అశోక్, కొప్పుల ప్రభావతిరెడ్డి, పసుమర్తి రాధా, మాదినేని లెనిన్, అమరనేని వీరభద్రం, మాదినేని బాబు, రంగారావు పాల్గొన్నారు.


రామాలయాన్ని దర్శించుకుంటున్న భక్తులు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బూర్గంపాడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లును బూర్గంపాడు పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బూర్గంపాడు మండల పరిధిలోని బుడ్డగూడెం గ్రామశివారులో కిన్నెరసాని వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ ప్రసాద్ సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. దాడుల్లో భాగంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లును మోరంపల్లిబంజర గ్రామంలో పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అస్థిపంజరాన్ని పరిశీలించిన ఏఎస్పీ

దుమ్ముగూడెం అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ములకపాడు గ్రామశివార్లలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి అస్థిపంజరం పడి ఉన్న ప్రాంతాన్ని ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్ మంగళవారం పరిశీలించారు. సంఘటనా స్థలంలోనే అస్థిపంజరానికి ఫోరెన్సిక్ సైన్స్ నిపుణులు పోస్టుమార్టం చేయడంతో పాటు ఆధారాలను సేకరించారు. ఈఏడాది ఆగస్టు 26న తప్పిపోయిన ములకపాడుకు చెందిన సిద్ది రవికుమార్ మృతదేహంగా ప్రాథమికంగా గుర్తించారు. చివరిసారిగా రవికుమార్ ధరించిన దుస్తులతోపాటు, గతంలో జరిగిన ఆటో ప్రమాదంలో అతడి శరీరంలో వేసిన రెండు ఇనుప రాడ్లను గుర్తించారు. రవికుమార్ మృతి వెనుక ఎటువంటి అనుమానస్పదం లేదని సీఐ వెంకటప్పయ్య తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా పట్టివేత

భద్రాచలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇండస్ట్రియల్ ఏరియాలోని నివాస సముదాయాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను టాస్క్‌ఫోర్స్, భద్రాచలం పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. నివాసప్రాంతాల్లో బాణసంచాను నిల్వ ఉంచారనే సమాచారం అందడంతో నాలుగు గోడౌన్లలో దాడులు నిర్వహించినట్లు తెలిసింది. ఈక్రమంలో సుమారు రూ.7లక్షల విలువైన బాణసంచాను నలుగురు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయంలో హుండీ చోరీ

భద్రాచలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీలో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోనికి ప్రవేశించి హుండీని దొంగిలించారు. ఈ చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఈ విషయంపై ఆలయ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అర్చకుడు ఈశ్వరశాస్త్రి మృతి


ఈశ్వరశాస్త్రి (ఫైల్)

కారేపల్లి అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): కారేపల్లి మండలంలో పలు ఆలయల్లో పౌరోహిత్యం చేస్తున్న గోదావరి ఈశ్వరశాస్త్రి(60) గుండెపోటుతో మంగళవారం మృతిచెందాడు. గత వారంరోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో కుటుంబసభ్యులు ఆయన్ని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా మంగళవారం ఆయనకు గుండెపోటు రావడంతో మృతిచెందారు. మృతిచెందిన ఈశ్వరశాస్త్రి భౌతికాయన్ని కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని కారేపల్లిలోని ఆయన నివాసానికి తీసుకవచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కామేపల్లి, గార్ల, రఘునాధపాలెం మండలాలకు చెందిన అర్చకులు ఆయన భౌతికఖాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈశ్వరశాస్త్రికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన కుమారుడు సాయి కూడా ఇటీవల మృతిచెందాడు. మండల పరిధిలోని పలువురు ప్రముఖులు, మాజీ ప్రజాప్రతినిధులు ఈశ్వరశాస్త్రి మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు.

కేఎంసీలో వాల్మీకి జయంతి



ఖమ్మంకార్పొరేషన్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగర పాలకసంస్థ కార్యాలయంలో మంగళవారం వాల్మీకి జయంతి నిర్వహించారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్, ఈఈ కృష్ణలాల్ ఇతర అధికారులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

డీఎంహెచ్‌వో కళావతిబాయి



ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ కళావతిబాయి

కామేపల్లి,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో డి.కళావతిబాయి, భద్రాచలం అదనపుడీఎంహెచ్ఓ డి.సైదులు అన్నారు. మంగళవారం మద్దుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలందరు ప్రభుత్వ వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వం కోట్లాది రూపాయాల వ్యయంతో వివిధ రకాల వైద్యసేవలు అందిస్తోందన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి డబ్బును వృథా చేసుకోవద్దని సూచించారు. ఈవైద్యశిబిరంలో వైద్యులు ప్రసన్నజ్యోతి, అమినాజ్, నిరోషా, రాజశేఖర్, అభిలాషరెడ్డి వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చందన, శిరీష,ఐటీడీఓ డీపీఎంఓ శ్రీనివాసరావు, హెచ్ఈఓలు లింగా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రసూతి ఆసుపత్రుల్లో ఫీజుల బోర్డులు ఏర్పాటు చేయాలి

- లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే జైలుకే
- వైద్యాధికారులతో కలెక్టర్ అనుదీప్ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): ప్రసూతి ఆస్పత్రుల్లో చికిత్సకు అయ్యే ఖర్చు వివరాల ఖర్చుల బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశంలో కలెక్టర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రశేఖరరావు, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నపిల్లల దత్తత కోసం సమాజంలో భారీ డిమాండ్ ఉందని, అనవసరంగా పిల్లలను చంపే సంస్కృతి పోవాలని, పుట్టిన తర్వాత దత్తత ఇచ్చేందుకు ఉన్న అవకాశాల గురించి కూడా అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఖమ్మం జిల్లాలో జరిగే ప్రసవాలలో వెయ్యి మంది మగ పిల్లలకు 946 మంది ఆడ పిల్లలు జన్మిస్తున్నారని, గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం జైలుశిక్ష, జరిమాన విధించబడుతుందని, కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ. చంద్రశేఖరరావు మాట్లాడుతూ పీసీపీఎన్డీటీ కింద నమోదు చేసే కేసుల్లో నిందితులకు తప్పనిసరిగా కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. నిందితులకు శిక్ష పడే విధంగా అవసరమైన ఆధారాలు సేకరించాలన్నారు. పోలీసు కమీషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ పీసీపీఎన్డీటీచట్టం కట్టుదిట్టంగా అమలు చేసేందుకు పోలీస్‌శాఖ తరపున సంపూర్ణ సహకారం అందించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారిణి బి.కళావతి బాయి, జిల్లాసంక్షేమ అధికారి కె.రాంగోపాల్ రెడ్డి, జిల్లాప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎం.నరేందర్,ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ టి.శంకర్,ఐఎంఏప్రెసిడెంట్ ఎస్.రెహానాబేగం, వైద్యఆరోగ్యశాఖపీవోలు పాల్గొన్నారు.

శ్రీజకు కలెక్టర్ అభినందన

ఇటీవల ప్రకటించిన గ్రూప్-1లో ఫలితాల్లో బీసీ సంక్షేమ అధికారిగా ఎంపికై, రాజన్న సిరిసిల్ల జిల్లా బీసీ సంక్షేమ అధికారిగా నియమితులైన సాయిశ్రీజను, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం అభినందించారు. శిక్షణలో భాగంగా జిల్లాకు వచ్చిన సందర్భంగా ఆమె కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందించారు.

క్రమశిక్షణతోనే విజయ సోపానాలు



ఖమ్మంక్రైం, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, సమయపాలన విజయసోపానాలని, పాటించిన ప్రతీ విద్యార్థి ఉన్నత స్థానాలు సాధిస్తారని ఖమ్మం పోలీస్ అదనపు డిప్యూటీ కమిషనర్ బిరామానుజం అన్నారు. పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేయూతగా అందించిన ఇరవైవేల రూపాయల చెక్కుమంగళవారం సాయంత్రం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పేదఇంజనీరింగ్ విద్యార్థి పండిట్ జయంత్ బాబుకు అందించారు. ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక చేయూత అందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ పరిశపుల్లయ్య సేవలను ప్రశంసించారు.ఈ. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పరిశపుల్లయ్య, విశ్రాంత పోలీస్‌శాఖ ఉద్యోగి జి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రశ్నించే వారిని గెలిపించాలి

తిరుమలాయపాలెం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై పోరాడే వ్యక్తులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

కంటి వైద్యశిబిరం విజయవంతం

భక్తరామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు వెంకట రామారావు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ అధ్యక్షుడు వెంకటరామారావు

నేలకొండపల్లి,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి భక్తరామదాసు సర్వీస్ సొసైటీ, లయన్‌కంటి ఆసుపత్రివైరాఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని బోదులబండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి వెంకట రామారావుప్రారంభించారు.200మంది రోగులు కంటిపరీక్షలు చేయించుకున్నారు. వారిలో 36మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి బుధవారం వైరాలోని లయన్ కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయనున్నారు. ఈ సందర్భంగా ఏటుకూరి వెంకటరామారావు మాట్లాడుతూ రానున్నరోజుల్లో మరిన్ని ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించటానికి చర్యలుచేపతామని రామారావు చెప్పారు. శిబిరంలో లయన్‌కంటి ఆసుపత్రి, వైరా వైద్యుడు రవిచంద్ర వైద్యసేవలందించారు. కార్యక్రమంలో కార్యదర్శి గెల్లా వెంకటరమణగుప్తా, కోశాధికారి దండా రవీంద్రబాబు, క్యాంపు చైర్మన్ గెల్లా జన్మోహన్‌రావు, వైస్ చైర్మన్ వెల్లంపల్లి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు యలమద్ది లెనిన్, పొన్నగాని శ్రీనివాస్, పాలడుగు పూర్ణచంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు తెల్లగొర్ల లింగస్వామి,కార్యవర్గ సభ్యులు రాయల రమేష్, పచ్చా తిరుపతయ్య, నంచర్ల దేవీప్రసాద్, భవనాశి దుర్గారావు, కోదూరి వెంకటాచారి,కొర్లకుంటనాగేశ్వరరావు,వల్లంచెట్ల భాస్కరరావు, షేక్.ఖాసీం, మందడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతీ రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా

టౌన్ ఏసీపీ రమణమూర్తి



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న ఏసీపీ

ఖమ్మంక్రైం,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్‌ఏసీపీ రమణమూర్తి హెచ్చరించారు.ఖమ్మండివిజన్ పరిధిలోని రౌడీ షీటర్లకు, చెడుప్రవర్తన కల్గిన వారికి ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. నేరప్రవృత్తిని వీడి సమాజంలో మంచినడవడికతో కొత్త జీవితాన్ని ప్రారంభించాలన్నారు.నేరస్తుల తొందరపాటులో నేరాలు చేసినా..వారికుటుంబ సభ్యులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. రౌడీషీటర్ అనే పదం తమ బిడ్డల భవిష్యత్‌ను ప్రభవితం చేస్తుందని గ్రహించాలని హితవు పలికారు. నేరప్రవృత్తిని మార్చుకోవడానికి ఒక అవకాశం ఇస్తున్నామని, ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందన్నారు. పూర్తిగా మారితే రౌడీషీట్ తొలగించేందుకు కూడా అవకాశం ఉందని చెప్పారు. రౌడీషీటర్ల కదలికలపై అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామన్నారు. పద్ధతి మార్చుకోకపోతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు.గతంలో అసాంఘిక కార్యక్రమాలు, గొడవలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలు పంపామని గుర్తు చేశారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

మండల ప్రత్యేకాధికారి రవికుమార్



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రవికుమార్

నేలకొండపల్లి,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి రవికుమార్ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పోలింగ్‌స్టేషన్లు, బాక్సులు సిద్ధంగా ఉంచాలని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటికే ఎన్నిలకోడ్ అమల్లో ఉన్నందున అధికారులు,సిబ్బంది ఎవ్వరూ రాజకీయ నాయకులతో అంట కాగకూడదన్నారు. అధికారులు సమష్టిగా పని చేసి విజయం సాధించాలన్నారు. ఎస్‌ఐ పెంటరి సంతోష్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో శాంతి భద్రతలకు ఎటువంటి ఆటంకం కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించామన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మర్రి ఎర్రయ్య, ఏవో ఎం.రాధ, ఎంపీఓ శివ పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి యత్నం సరికాదు



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఖమ్మంఅర్బన్,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నం సరికాదని మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు..సనాతన ధర్మం అంటూ అగ్రకుల అహంకారంతో దాడికి యత్నించటాన్ని ఖండిస్తున్నామన్నారు. దళిత ప్రధాన న్యాయమూర్తిమీద జరిగినదాడి దేశంలో పెరుగుతున్న అసహన, అమానుష, దళిత వ్యతిరేక ధోరణికి నిదర్శన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడికి యత్నించటం శోచనీయమని ఇన్సాఫ్ నేత మహ్మద్ సలాం ఒకప్రకటనలో ఖండించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు బీజేపీ సనాతన ధర్మాన్ని అడ్డం పెట్టుకుంటోందన్నారు.

ఖమ్మంచర్చికాంపౌండ్: గవాయ్‌పై దాడిని ఖండిస్తున్నట్టు బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు.మంగళవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమవేశంలో మాట్లాడారు. రాజ్యాధికారం దక్కనంతకాలం అణిచివేతలు ఉంటాయని తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో వేల్పుల రామయ్య, మిరియాల నాగరాజు, బుర్ర ఉపేందర్ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ఖమ్మంలీగల్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ పైన దాడికి యత్నంపై సోమవారం ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించారు.నల్లబ్యాడ్జీలతోనిరసన వ్యక్తం చేశారు. బార్‌అసోసియేషన్‌హాల్లో నిర్వహించినసమావేశంలో పలున్యాయవాద సంఘాల బాధ్యులు మాట్లాడుతూ ఈ దాడి భారత న్యాయవ్యవస్థపైన జరిగిన దాడిగా భావిస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు అనంతరం కోర్టుఆవరణలో పెద్ద ఎత్తున నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు, కార్యదర్శి గద్దల దిలీప్, బార్‌కార్యవర్గంతోపాటు వివిధ సంఘాల లీగల్‌సెల్ బాధ్యులు, జూనియర్ సీనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వేంకటేశ్వరావు ఈ ఘటనను ఖండిస్తున్నట్లు చెప్పారు.

వేతనాలు విడుదల చేయాలి

ఖమ్మంఅర్బన్,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): సాంఘీక సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం లెక్చరర్లు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయటంతోపాటు గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన నగర ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో జిల్లాఉపాధ్యక్షుడు రాజు, నగర నాయకులు త్రినాథ్, లోకేష్, మనోజ్, రమణ, అభి పాల్గొన్నారు.

బెస్ట్‌అవైలబుల్ స్కూళ్లపై నిర్లక్ష్యం తగదు

ఖమ్మంఅర్బన్,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): బెస్ట్‌అవైలబుల్ స్కూల్స్ పట్లప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి తగదని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ అన్నారు. మంగళవారం సీపీఎం జిల్లాకార్యాలయం సుందరయ్యభవన్‌లో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బకాయిల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా బెస్ట్‌అవైలబుల్ స్కూళ్లు మూసి వేతకు సిద్ధపుతున్నాయన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రసమితి సభ్యులు మాగం లోకేష్, జిల్లా కార్యదర్శి శివనాయక్ గోపి, చంటి పవన్, నరేందర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను నివారించాలి

ఖమ్మంఅర్బన్,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి):నగరంలో ట్రాఫిక్‌సమస్యనునివారించేందుకు పార్కింగ్ స్థలాలను కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీదేవి ఆసుపత్రిసెంటర్‌లో నిర్వహించిన రాస్తారోకోలో మాట్లాడారు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించాలన్నారు. సెల్లార్లను దుకాణాలకు కేటాయిస్తుండటంతో సమస్య ఏర్పడుతోందన్నారు. కార్యక్రమంలో టుటౌన్ ఏరియా కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, జ్వాలా నరసింహారావు, మంద వెంకటేశ్వర్లు, షేక్ చానా, యస్ కుమార్ తదితరులుపాల్గొన్నారు.

ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా రామకృష్ణ



ఖమ్మంలీగల్,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి):సీనియర్ న్యాయవాది ఉబ్బన రామకృష్ణనుఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా నియమించారు.ఈ మేరకు ఆర్టీసీ ఆర్ఎం నుంచి ఉత్తర్వులు అందుకున్నారు.

'స్థానికం'పై టెన్షన్!

(5వ పేజీ తరువాయి)

జడ్పీటీసీలకు మొదటి విడత ఎన్నికలు 23న, రెండో విడత 27న, కౌంటింగ్ నవంబరు11న నిర్వహించనున్నారు.

- మొదటి విడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో అక్టోబరు 17నుంచి 19వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 20వ తేదీన పరిశీలన, ఉపసంహరణ 23 ఉంటాయి. 31వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు ఫలితాలుంటాయి.
- రెండో విడత కు సంబంధించి అక్టోబరు 21నుంచి 23వరకు నామినేషన్లు, 24న పరిశీలన, ఉపసంహరణ 27న ఉంటాయి. నవంబరు4న పోలింగ్, అదే రోజున ఓట్ల లెక్కింపు ఫలితాల వెల్లడి.
- మూడో విడత ఎన్నికలు జరిగే పంచాయితీల్లో అక్టోబరు 25నుంచి 27వరకు నామినేషన్ల స్వీకరణ, 28న పరిశీలన, ఉపసంహరణ 31న జరుగుతాయి. నవంబరు 8న పోలింగ్, అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు.
- ఖమ్మం జిల్లా పరిధిలో 20జడ్పీటీసీలు, 283 ఎంపీటీసీ స్థానాలున్నాయి. ఇక 571 పంచాయతీల్లో 5,214వార్డులున్నాయి. ఇందుకు గాను 5,214 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 8,02,690మంది ఓటర్లున్నారు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 6,69,048మంది ఓటర్లకుగాను 471 పంచాయతీలు 4,168వార్డులున్నాయి. 4,242 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ జిల్లాలో జడ్పీటీసీలు 22, ఎంపీటీసీలు233 ఉన్నాయి.

ఆశావహుల్లో మరింత ఉత్కంఠ..

యంత్రాంగం ఎన్నికల నోటిఫికేషన్‌కు సర్వం సిద్ధం చేస్తుండగా.. కోర్టు విచారణ నేపథ్యంలో రాజీయపార్టీల్లో ముఖ్యంగా ఆశావహుల్లో మరింత ఉత్కంఠ కనిపిస్తోంది. ప్రధాన పార్టీలు తమ అభ్యర్థుల జాబితాలను సిద్ధం చేసినా అధికారికంగా ఎక్కడా ప్రకటించడంలేదు. అధికారులు ప్రకటించిన రిజర్వేషన్ ప్రకారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులతో పాటు సర్పంచ్ వార్డు పదవులకు ఇప్పటికే అభ్యర్థులను గుర్తించాయి. కొందరు ఆశావహుల జాబితాలను కూడా సిద్ధం చేశారు. అయితే హైకోర్టులో తీర్పును బట్టి అభ్యర్థుల జాబితా ప్రకటించి నామినేషన్ల దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాంగ్రెస్, సీపీఐలు కలిసి పోటీచేసే అవకాశం ఉండగా బీఆర్ఎస్, సీపీఎంలు జిల్లాలో కొన్ని మండలాల్లో జతకట్టే అవకాశం కనిపిస్తుంది. బీజేపీ కూడా ఎన్నికలకు సై అన్నట్టుగా ప్రచారం సాగిస్తోంది. అయితే బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా కలిసి పోటీచేసే పరిస్థితి జిల్లాలో కనిపించడం లేదు. మొత్తంమీద బుధవారం జరిగే కోర్టు విచారణ, తీసుకునే నిర్ణయాన్ని అనుసరించి గురువారం నుంచి జిల్లా రాజకీయాల్లో వేడి మొదలుకానుంది స్థానిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానుంది.



సత్తుపల్లిలో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల బాధ్యులు

సత్తుపల్లి డిపోకు దసరా కళ

- సోమవారం.. ఒక్కరోజే రూ.37.95లక్షల ఆదాయం
- మునుపెన్నడూ లేనివిధంగా ప్రయాణం
- సత్తుపల్లి ఆర్టీసీ డీఎం ఊటుకూరి సునీత


సత్తుపల్లి ఆర్టీసీ డిపో గేట్ వద్ద కేక్ కట్‌చేసిన డీఎం



సత్తుపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దసరా పండగవేళ సత్తుపల్లి ఆర్టీసీ డిపోకి ఆదాయం కలిసొచ్చింది. దసరా పండగ సందర్భంగా ఈనెల 6వ తేదీ సోమవారం ఒక్కరోజే రూ.37,95,470ఆదాయం సమకూరినట్లు డిపో మేనేజర్ ఊటుకూరి సునీత ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం సత్తుపల్లిలోని డిపో గేట్ వద్ద ఉద్యోగుల నడుమ కేక్ కట్‌చేసి సంబురాలు నిర్వహించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక బస్సుల్లో ఈసారి 50శాతం వరకు అదనపు చార్జీలను వసూలు చేయగా గత ఏడాది దసరా రూ.33,58,658, ఈ ఏడాది సంక్రాంతికి రూ.37లక్షలు, రాఖీ పౌర్ణమి నాడు 35,45,329 ఆదాయాన్ని అధిగమించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో ఈ ఒక్కరోజే 106శాతం ఆక్యుపెన్సీ రేషియో, 67.80ఈపీకే సాధించగా మొత్తంగా సుమారు 56వేల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చామని చెప్పారు. ఇందులో 32వేల మంది మహిళలు కాగా 24వేల మంది పురుషులు ప్రయాణించగా డిపో చరిత్రలో రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరడం అభినందనీయమన్నారు. రద్దీకి అనుగుణంగా సత్తుపల్లి డిపో నుంచి తిరుగు ప్రయాణానికి రెగ్యూలర్ సర్వీసులతోపాటు అదనపు సర్వీసులను నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ సర్వీసులను వినియోగించుకోవడంతో సత్తుపల్లి ఆర్టీసీ డిపో భారీగా ఆదాయం ఆర్జించిందని, ఈ సందర్భంగా సత్తుపల్లి టీం సభ్యులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితీ, వీబీఓ కిన్నెర ఆనందరావు, ఏడీసీలు, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలతోపాటు పథకాల అమలు

పెనుబల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలతోపాటు పలు పథకాలను అమలుచేస్తోందని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం వీఎం బంజర్‌లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పార్టీ అమలు చేయని అనేక పథకాలు రెండేళ్ల కాలంలో అమలు చేసి చూపించామన్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కాంగ్రెస్ పార్టీపైన, స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయిపై ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. కాంగ్రెస్ పాలనలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత తమ పార్టీకే దక్కిందన్నారు. సోమరాజు సీతారామారావు, కీసర శ్రీనివాసరెడ్డి, పొట్టపల్లి వెంకటేశ్వరరావు, వేముల కృష్ణయ్య, గోదా రాములు, రాధాకృష్ణ, కాంతయ్య పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థను కాపాడుకోవాలి

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ బీఆర్.గవాయిపై జరిగిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా న్యాయ వ్యవస్థను కాపాడుకోవాలని కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు కొలికపోగు సర్వేశ్వరరావు కోరారు. మంగళవారం గవాయిపై దాడికి నిరసనగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. దేశంలో అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడిని భారత రాజ్యాంగ వ్యవస్థపై దాడిగా అభివర్ణిస్తున్నామన్నారు. శీలం సత్యనారాయణరెడ్డి, మోరంపూడి పాండు, రావుల రాజబబు, రాము, అర్జున్, శతర్, సుశీల, రత్నం, పద్మ, మరియమ్మ, సుజాత, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అదేవిధంగా న్యాయవాది, రిటైర్డ్ సీఏఓ బోయినపల్లి రవికుమార్ మాట్లాడుతూ.. ఇలాంటి సంఘటనతో దేశ ఔన్నత్యం బజారున పడిందని, ఇది న్యాయ వ్యవస్థకు కళంకమన్నారు.

సీసీఐ నిబంధనలు సడలించాలి

ఏన్కూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సీసీఐ నిబంధనలు సడలించి వెంటనే పత్తి కొనుగోళ్లను ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం బృందం మంగళవారం మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిసాన్ కపాస్ యాప్‌లో ఎంట్రీ చేసుకున్నా రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయాలనే నిబంధనను సడలించాలని కోరారు. వర్షాల వల్ల దెబ్బతిన్న పంటకు ఎకరానికి రూ.30వేలు పరిహారం అందించాలని కోరారు. గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దొంతబోయిన నాగేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి గుండా సత్యనారాయణరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి మాజీ ఎంపీటీసీ భూక్యా లక్ష్మా, వ్యవసాయకార్మిక సంఘం మండల కార్యదర్శి ఇటికాల లెనిన్, రైతు నాయకులు తాళ్లూరి వెంకటప్పయ్య పాల్గొన్నారు.

‘స్థానికం’లో సీపీఎంను గెలిపించండి

- భూక్యా వీరభద్రం, తాళ్లపల్లి కృష్ణ



మాట్లాడుతున్న భూక్యా వీరభద్రం

కొణిజర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన పోరాడుతున్న వారిని స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ కోరారు. మంగళవారం కొణిజర్లలో జరిగిన ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసివచ్చే వామపక్ష లౌకిక పార్టీలతో ఎన్నికల సర్దుబాటు చేసుకోవడానికి సీపీఎం సిద్ధంగా ఉందని తెలిపారు. మండలంలోని 8ఎంపీటీసీ స్థానాలతోపాటు జడ్పీటీసీ స్థానానికి పోటీచేయాలని పార్టీ మండల కమిటీ నిర్ణయించిందని వారు తెలిపారు. ప్రజల పక్షాన పోరాడే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రైతుల సమస్యలతో పాటు పోడుభూముల సమస్య వివిధ గ్రామాల స్థానిక సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించామని, గతంలో సీపీం ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ, ఎంపీపీ పరిపాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను సీపీఎం చేపట్టిందని గుర్తుచేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, సీనియర్ నాయుకలు కొప్పుల కృష్ణయ్య, మండల నాయకులు మోతుకూరి వెంకటేశ్వరరావు, బోయినపల్లి శ్రీనివాసరావు, చింతపల్లి ప్రసాద్, మాజీ సర్పంచ్ పుల్లూరి వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి విజయ, బానోత్ హరిచందు, తేజావత్ సీతారాములు, లింగాల దానయ్య, షేక్ అప్జల్, కట్టా రాంబాబు, బుర్రి గోపయ్య, దారగాని రాములు పాల్గొన్నారు.

భావి పౌరులకు మన గొప్పతనం చెప్పాలి

- సత్తుపల్లిలో ఘనంగా వాల్మీకి జయంతి


ముదిగొండలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్


బెటాలియన్‌లో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమాండెంట్

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): భావిభారత పౌరులు గర్వపడేలా మహనీయుల గొప్పతనాన్ని చాటిచెప్పాలని బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెదబాబు, మునిసిపల్ కమిషనర్ కొండ్రా నర్సింహా అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా స్థానిక మునిసిపల్ కార్యాలయంతోపాటు మండల పరిధిలో గల గంగారంలోని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. వాల్మీకి ఆదికవిగా, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మహాకవిగా, రామాయణ మహాకావ్యాన్ని రచించిన మహర్షిగా చిరకాలం నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది, బెటాలియన్‌లో అదనపు దళాదిపతి ఎ.అంజయ్య, సహాయ దళాధిపతులు ఎస్.శ్రీధర్‌రాజా, ఎస్‌డి.రంగారెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పటాలపు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముదిగొండ: ముదిగొండ రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం వాల్మీకి జయంతిని నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పీవో, ఏపీవోలకు శిక్షణ

వైరా, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో పనిచేస్తూ ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామపంచాయతీ ఎన్నికలకు పీవో, ఏపీవోలుగా నియమితులైన సిబ్బందికి బుధవారం వైరా రైతు వేదికలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సక్రియ తెలిపారు. బ ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని, శిక్షణ తరగతులకు హాజరు కానివారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుతందని, పోస్టల్ బ్యాలెట్ కోసం ఎన్నికల డ్యూటీ ఆర్డర్స్ జతచేస్తూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కొమరంభీం వర్ధంతి

పెనుబల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ పోరాట యోధుడు కొమరంభీమ్ 80వ వర్ధంతిని మంగళవారం పెనుబల్లిలో పలు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరంభీమ్ విగ్రహానికి గిరిజన సంఘం నాయకులు కాకా వెంకటేశ్వర్లు, తెల్లం సురేష్, రాసా శ్రీను ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాటి రాజారావు, కడియం నాగేశ్వరరావు, పద్దం వీరస్వామి, వాడే రాంబాబు, దారబోయిన ప్రసాద్, తాటి రాంబాబు పాల్గొన్నారు.

వాహనాలకు నెంబర్ ప్లేట్లు తప్పనిసరి


ఎస్ఐ రామరావు

వైరా, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వాహనాల ప్లేట్లపై తప్పనిసరిగా నెంబర్లు ఉండాలని వైరా ఎస్ఐ పుష్పాల రామారావు అన్నారు. ప్రతి వాహనదారుడు వాహనానికి ముందు, వెనుక తప్పనిసరిగా నెంబర్‌ప్లేట్‌పై వాహన నెంబర్ మాత్రమే ఉంచాలని సూచించారు. అలా కాకాకుండా పేర్లు రాస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వాహనానికి మించి సైలెన్సర్‌లు పెట్టి శబ్ధాలు చేస్తే వారి వివరాలను వాహన నెంబర్లను పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ఎన్నికల విధుల ఆర్డర్ కాపీల పంపిణీ


పోలింగ్ సిబ్బందికి విధులకు సంబంధించిన ఆర్డర్ కాపీలను అందజేస్తున్న అధికారులు

కారేపల్లి, అకోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు శాఖల సిబ్బందికి మంగళవారం విధులకు సంబంధించిన ఆర్డర్ కాపీలను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఐకేపీ, ఐసీడీఎస్, ఈజీఎస్, స్కూల్ అసిస్టెంట్లు, మండల తహసీల్దార్ కార్యాలయాలకు చెందిన వారికి అధికారులు ఆర్డర్ కాపీలను అందచేశారు. వీరందరికి బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాశాలలో ఉదయం 11గంటల నుంచి శిక్షణకార్యాక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. శిక్షణకార్యక్రమానికి ఆర్డర్ కాపీలు తీసుకున్న వారు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

పెండింగ్ డీఏలను మంజూరు చేయాలి

కొణిజర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే మంజూరు చేయాలని, రెండో పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ కరామత్ అలీ కోరారు. మంగళవారం ఆయన కొణిజర్లలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. గత పదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం డీఏలను పెండింగ్‌లో పెట్టడం పరిపాటిగా మారిందన్నారు. ఉద్యోగుల సహనం పరిశీలించకుండా వెంటనే డీఏలను మంజూరుచేయాలని డిమాండ్ చేశారు.

ఏన్కూరు సీపీఎం జడ్పీటీసీ అభ్యర్థిగా గుడ్ల


గుడ్ల వెంకటేశ్వరరావు

ఏన్కూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు జడ్పీటీసీ స్థానానికి సీపీఎం పార్టీ అభ్యర్థిగా గుడ్ల వెంకటేశ్వరరావును బరిలో దింపేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. పొత్తులు కుదరని పక్షంలో ఒంటరిగా పోటీ చేసేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎస్ఎఫ్ఐ నాయకుడిగా, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శిగా, సీఐటీయూ మండల కార్యదర్శిగా, మెడికల్ అసోసియేన్ మండల అధ్యక్షుడిగా ఆరికాయలపాడు ఉపసర్పంచ్‌గా ఆయన మండల ప్రజలకు సుపరిచితుడు. 20 ఏళ్లగా పార్టీలో ఉండి ప్రజలతో సత్సంబంధాలు కలిసి వచ్చే అంశంగా పార్టీ భావిస్తోంది.

హైవేపై గుంతను పూడ్చిన యువకులు

పెనుబల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారిపై లంకపల్లి గ్రామంలో పెద్ద గొయ్యి ఏర్పడింది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో ఆ గ్రామానికి చెందిన శ్రీ విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ యూత్ ఆధ్వర్యంలో గుంతను కాంక్రీట్ వేసి పూడ్చారు.

‘స్థానికం’పై టెన్షన్!

(5వ పేజీ తరువాయి)

జడ్పీటీసీలకు మొదటి విడత ఎన్నికలు 23న, రెండో విడత 27న, కౌంటింగ్ నవంబరు11న నిర్వహించనున్నారు.

● మొదటి విడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో అక్టోబరు 17నుంచి 19వరకు నామినేష్ల స్వీకరణ ఉంటుంది. 20వ తేదీన పరిశీలన, ఉపసంహరణ 23 ఉంటాయి. 31వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు ఫలితాలుంటాయి.

● రెండో విడత కు సంబంధించి అక్టోబరు 21నుంచి 23వరకు నామినేషన్లు, 24న పరిశీలన, ఉపసంహరణ 27న ఉంటాయి. నవంబరు4న పోలింగ్, అదే రోజున లెక్కింపు ఫలితాల వెల్లడి.

● మూడో విడత ఎన్నికలు జరిగే పంచాయితీల్లో అక్టోబరు 25నుంచి 27వరకు నామినేషన్ల స్వీకరణ, 28న పరిశీలన, ఉపసంహరణ 31న జరుగుతాయి. నవంబరు 8న పోలింగ్, అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు.

● ఖమ్మం జిల్లా పరిధిలో 20జడ్పీటీసీలు, 283 ఎంపీటీసీ స్థానాలున్నాయి. ఇక 571 పంచాయతీల్లో 5,214వార్డులున్నాయి. ఇందుకుగాను 5,214 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 8,02,690మంది ఓటర్లున్నారు.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 6,69,048మంది ఓటర్లకుగాను 471 పంచాయతీలు 4,168వార్డులున్నాయి. 4,242 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ జిల్లాలో జడ్పీటీసీలు 22, ఎంపీటీసీలు233 ఉన్నాయి.

ఆశావహుల్లో మరింత ఉత్కంఠ..

యంత్రాంగం ఎన్నికల నోటిఫికేషన్‌కు సర్వం సిద్ధం చేస్తుండగా.. కోర్టు విచారణ నేపథ్యంలో రాజీయపార్టీల్లో ముఖ్యంగా ఆశావహుల్లో మరింత ఉత్కంఠ కనిపిస్తోంది. ప్రధాన పార్టీలు తమ అభ్యర్థుల జాబితాలను సిద్ధం చేసినా అధికారికంగా ఎక్కడా ప్రకటించడంలేదు. అధికారులు ప్రకటించిన రిజర్వేషన్ ప్రకారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులతో పాటు సర్పంచ్ వార్డు పదవులకు ఇప్పటికే అభ్యర్థులను గుర్తించాయి. కొందరు ఆశావహుల జాబితాలను కూడా సిద్ధం చేశారు. అయితే హైకోర్టులో తీర్పును బట్టి అభ్యర్థుల జాబితా ప్రకటించి నామినేషన్ల దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాంగ్రెస్, సీపీఐలు కలిసి పోటీచేసే అవకాశం ఉండగా బీఆర్‌ఎస్, సీపీఎంలు జిల్లాలో కొన్ని మండలాల్లో జతకట్టే అవకాశం కనిపిస్తుంది. బీజేపీ కూడా ఎన్నికలకు సై అన్నట్టుగా ప్రచారం సాగిస్తోంది. అయితే బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా కలిసి పోటీచేసే పరిస్థితి జిల్లాలో కనిపించడం లేదు. మొత్తంమీద బుధవారం జరిగే కోర్టు విచారణ, తీసుకునే నిర్ణయాన్ని అనుసరించి గురువారం నుంచి జిల్లా రాజకీయాల్లో వేడి మొదలుకానుంది ఎన్నికల నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానంది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర


సమావేశంలో మాట్లాడుతన్న సండ్ర

తల్లాడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో తల్లాడ మండలాన్ని బీఆర్‌ఎస్ పార్టీ కైవసం చేసుకునేలా సత్తా చాటాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. మంగళవారం మండలంలోని అన్నారుగూడెంలో మహాలక్ష్మి కళ్యాణమండపంలో బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృత సమవేశంలో ఆయన మాట్లాడుతూ.. సత్తుపల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ బలంగా ఉన్న మండలాల్లో తల్లాడ మండల ఒకటని, పరిషత్ చరిత్రలో ఎంపీపీ పదవి కాంగ్రెస్ పార్టీకి దక్కలేదని, ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు దక్కకుండా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషిచేయాలని కోరారు. మండల నాయకత్వమే ఎంపీటీసీల అభ్యర్థులను ఎంపిక చేయాలని, ఆయా ఎంపీటీసీల పరిధిలోని గ్రామాల పార్టీ నాయకత్వాన్ని సమన్వయం చేసుకుని అన్ని సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని సమర్థవంతమైన అభ్యర్థులను ఎంపిక చేయాలని తెలిపారు. ముందుగా అమరజీవి దొడ్డాకృష్ణయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకటలాల్, మండల నాయకులు దిరిశాల దాసురావు కేతినేని చలపతిరావు, నాయుడు శ్రీనివాసరావు, ముప్వా మురళీధర్‌రావు, పెరికె నాగేశ్వరరావు, కోడూరు వీరకృష్ణ, జీవీఆర్, రుద్రాక్ష బ్రహ్మం, ఆదూరి వెంకటేశ్వర్లు, బానోతు మోహన్, కొపెల కనకయ్య, శీలం శ్రీనివాసరెడ్డి, బద్దం కోటిరెడ్డి పాల్గొన్నారు.

వారంటీ దాటిన కాంగ్రెస్ గ్యారంటీ కార్డు

- జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజ్

చింతకాని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ సృష్టించిన గ్యారంటీ కార్డు వారంటీ దాటిపోయి బాకీ కార్డుగా మారిందని బీఆర్‌ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో నిర్వహించిన మండల పార్టీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. గత ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారంలో భట్టి మధిర ప్రజలకు దైవసాక్షిగా రాసిచ్చిన 6 గ్యారంటీల అఫడవిట్ ఏమైందని ప్రశ్నించారు.


మాట్లాడుతున్న కమల్‌రాజ్